
సాక్షి
గుంటూరు

బుధవారం । 27 । ఆగస్టు । 2025



పాఠశాలలకు ఫర్నిచర్ వితరణ

మంగళగిరి టౌన్: నగర పరిధిలోని పలు పాఠశాలలకు రూ. 1.75లక్షల విలువైన బీరువాలు, టేబుళ్లు, కుర్చీలను మంగళవారం ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,28,831 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. దిగువకు 1,15,832 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం 39.9303 టీఎంసీలు.



పశ్చిమ డెల్టాకు నీరు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,216 క్యూసెక్కులు మంగళవారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.

న్యూస్‌రీల్

బార్ షాపుల దరఖాస్తుకు గడువు పొడిగింపు

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో 110 బార్ షాపుల నిర్వహణకు గానూ దరఖాస్తు గడువును ఈ నెల 26వ తేదీ నుంచి 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 30న నిర్వహించనున్న లాటరీ ద్వారా షాపులను కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆల్మాస్‌కు బ్రాంజ్ మెడల్



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన సాదియా ఆల్మాస్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ప్రపంచ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈనెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 3 వరకు సంజోష్ జిల్లా కోస్టారికాలో పోటీలు జరుగుతున్నాయి. ఇందులో స్క్వాట్ 185 కేజీలు, బెంచ్ ప్రెస్ 100 కేజీలు, డెడ్ లిఫ్ట్ 105 కేజీలు (సిల్వర్ మెడల్) కలిపి మొత్తం 470 కేజీల బరువు ఎత్తి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కర రావు, షేక్ సంధాని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా అసోసియేషన్‌లు ఆల్మాస్‌ను అభినందించినట్లు పేర్కొన్నారు.

రైల్వేలపై సమస్యలు ఉంటే తెలియజేయండి !

జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు ఆతుకూరి ఆంజనేయులు



నగరంపాలెం: సికింద్రాబాద్ రైల్వే నిలయంలో వచ్చే నెల 3న జోనల్ రైల్వే యూజర్స్ కన్జ్యూమర్ కమిటీ (జెడ్‌ఆర్‌యూసీసీ) సమావేశం జరగనున్నట్లు సభ్యులు, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ శాశ్వత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నా టవర్ కూడలిలోని ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు రైల్వేస్టేషన్, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్, నంబూరు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరుతూ ఇప్పటికే లేఖల ద్వారా దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు తెలియజేశానని ఆయన పేర్కొన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. రైల్వే పరంగా ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వచ్చే నెల 3న జరిగే సమావేశంలో మాట్లాడతానని ఆంజనేయులు తెలిపారు. సమావేశంలో కామర్స్ ఉపాధ్యక్షుడు ఆతుకూరి నగేష్, సభ్యులు కాశీ వెంకటరాంబాబు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో పలు అనర్థాలు



గుంటూరు లీగల్: బాల్య వివాహాలతో పలు అనర్థాలు జరుగుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మంగళవారం శ్యామలానగర్ బంజారా కాలనీలో బాల్య వివాహాలు, గిరిజన మహిళల్లో ఎర్లీ ప్రెగ్నన్సీపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని ఆడ పిల్లలకు, 21 సంవత్సరాలు నిండని మగపిల్లలకు వివాహం చేయరాదని, అది చట్టపరంగా నేరమని తెలిపారు. ఆ వయస్సులో వారు మానసికంగా, శారీరకంగా వివాహానికి సిద్ధంగా ఉండరని చెప్పారు. ఈ సమయంలో చదువుకోవడం ముఖ్యమని సూచించారు. గిరిజన మహిళల్లో ఎర్లీ ప్రెగ్నెన్సీ వల్ల సమస్యలు ఎక్కువగా ఉంటాయని, జాగ్రత్తగా లేకపోవడం వల్ల గర్భస్రావం జరిగే అవకాశం ఉందని సూచించారు. గిరిజన ప్రజల్లో అవగాహన పెరగాలంటే విద్య చాలా అవసరమని తెలిపారు. చట్ట పరంగా తీసుకునే చర్యలు, న్యాయ పరమైన సలహాల గురించి వివరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రఘునాథ్ , మెడికల్ ఆఫీసర్ బి.స్వరోచి పాల్గొన్నారు.









స్వాగతం.. గణేషా !

వినాయక చవితి అంటే కేవలం పండుగే కాదు.. ప్రకృతితో మనిషికి ఉన్న అవినాభావ సంబంధం. పూజల్లో వాడే పత్రి ఔషధాల సమ్మిళితం.. పూలు ఆహ్లాదభరితం.. పండ్లు ఆరోగ్యదాయకం.. మట్టి గణపయ్యకు పూజలు మనిషికీ, మట్టికి ఉన్న బంధానికి నిదర్శనం. ఇక గణాధిపతి అయిన వినాయకుడిని పూజించడం వల్ల సకల శుభాలు జరుగుతాయని, సంవత్సరమంతా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. చిన్నాపెద్ద, పేద, ధనిక అనే తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకుంటారు. బుధవారం వినాయచవితి సందర్భంగా నగరంలో మంగళవారం సందడి నెలకొంది. వీధులన్నీ పత్రి, పూల అమ్మకాల దుకాణాలతో నిండిపోయాయి. పూజా సామగ్రి కొనుగోలుతో గుంటూరు నగరమంతా సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ , గుంటూరు

రాష్ట్రంలో రెడ్‌బుక్ అరాచక పాలన

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ధ్వజం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి పరామర్శ



వెంకటప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లు గాయాలను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షులు గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్ బుక్ అరాచక పాలన నడుస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు.అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ నేతలు ఆసుపత్రులు, జైలులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం సరిపోతోందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గం టి. అన్నవరంలో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి, గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నేత వెంకట ప్రసాద్‌ను మంగళవారం ఆయన నరసరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. దాడిలో వెంకట ప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లుకు అయిన గాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా వెంకట ప్రసాద్ పని చేయడంతో అతడిని అంతం చేయాలని ప్లాన్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు సింపుల్‌గా 324 కేసు వేశారని తెలిపారు. ఇరుపక్షాలు కేసు తీసుకొని జైలుకు వెళ్లే పని లేకుండా రాజీపడమని నోటీసులు తీసుకునే సింపుల్ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. న్యూట్రల్‌గా ఉండాల్సిన పోలీసులు అధికార పార్టీకి ఏకపక్షంగా పని చేస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ రెడ్ బుక్ ఎల్లకాలం ఉండదని, రానున్న రోజుల్లో వేరే బుక్కులు వస్తాయి అనే విషయాన్ని ఆయన గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. మాచర్లలో రెండు టీడీపీ ముఠాలు కొట్టుకొని హత్యలు చేసుకుంటే, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే వినుకొండలో రషీద్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తను అతి కిరాతకంగా నరికి చంపారని తెలిపారు. రాష్ట్రంలో ఇంత అరాచకాలు జరుగుతున్నా రాష్ట్ర డీజీపీ, ఎస్పీలు పొల్యూట్ అయి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టే అక్రమ కేసులపై న్యాయస్థానాల ద్వారా పోరాటం చేస్తామని తెలిపారు.

బాధితుడి పైనే కేసు నమోదు

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ నేత వెంకట ప్రసాద్ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉంటే అతడి పైనే కేసు నమోదు చేయడం దారుణమని ఖండించారు. హత్యాయత్నానికి గురైన బాధితుడుపైనే తిరిగి పోలీసులు కేసు నమోదు చేయడం చూస్తే రెడ్ బుక్ రాజ్యాంగం ఎంత బలంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్య జరిగిందంటూ వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

కక్షతోనే దాడి

మాజీ ఎమ్మెల్యే బొల్లా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

రాష్ట్రంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో రెడ్ బుక్ రాజ్యాంగం పక్కాగా అమలు జరుగుతోందని, దాని డైరెక్షన్‌లోనే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు తెగబుతున్నారని వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వెంకట ప్రసాద్ వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా పని చేశాడనే కక్షతోనే స్థానిక టీడీపీ గూండాలు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల ప్రోద్బలంతో అతన్ని చంపేందుకు ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆకృత్యాలపై పోలీసులు న్యాయబద్ధంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

> గుంటూరు రూరల్ మండలం తురకపాలేనికి చెందిన వెంకట్రావు 45 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసం ఉన్నాయి. పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా తగ్గలేదు. ఊపిరితిత్తుల్లో నెమ్ము, కామెర్లుగా నిర్ధారించి చికిత్స అందించారే గానీ, వ్యాధి పూర్తిగా తగ్గలేదు. రోగికి వ్యాధి నిర్ధారణ కూడా కాలేదు. జ్వరం తగ్గక పోవడంతో బంధువులు ఇన్‌ఫెక్షన్ స్పెషలిస్ట్‌ను సంప్రదించారు. బ్లడ్ కల్చర్ పరీక్షలు చేసి మెలియాయిడోసిస్ నిర్ధారించారు. యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయడంతో కోలుకున్నాడు.

> ఇబ్రహీంకు ఆక్సిజన్ లెవల్స్ పూర్తిగా తగ్గిపోయి, ఐసీయూలో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు సీటీ స్కాన్ పరీక్ష చేసి, ఊపిరితిత్తుల్లో చిన్న గడ్డ ఉన్నట్లు నిర్ధారించారు. బ్లడ్ కల్చర్ పరీక్షలు చేశారు. సుడోమాలీ అనే బాక్టీరియా వల్ల వచ్చే ప్రమాదకరమైన ఇన్ఫెక్షన్ మెలియాయిడోసిస్ నిర్ధారించారు. షుగర్, లివర్, కిడ్నీకి సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో ఇది ఎక్కువగా ప్రభావం చూపిస్తుందని ఇన్‌ఫెక్షన్ స్పెషలిస్టులు వెల్లడించారు.

మెలియాయిడోసిస్

అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకం

- వర్షాకాలంలో కేసులు ఎక్కువగా నమోదు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- జిల్లాలో కొత్తగా నాలుగు కేసులు నమోదు



గుంటూరు మెడికల్: మెలియాయిడోసిస్ వ్యాధి మన దేశం సహా దక్షిణ ఆసియాలోని ఇతర ఉష్ణ మండల ప్రాంతాల్లో వర్షా కాలంలో ఎక్కువగా ప్రబలుతుంది. మన దేశంలో తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. డెంగీ, స్క్రబ్ టైఫస్‌తో పాటు వర్ష కాలంలో మెలియాయిడోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో నలుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాధిపై అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మెలియాయిడోసిస్ సోకిన వారిలో జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి. ఇవి టీబీ వ్యాధిని (క్షయ) పోలి ఉండటంతో ఆ పరీక్షలు చేయించాలి. టీబీ అని తేలకపోతే మెలియాయిడోసిస్‌గా గుర్తించాలి. బ్లడ్ కల్చర్ ద్వారా మాత్రమే వ్యాధి నిర్ధారణ అవుతుంది.

వ్యాధి సోకే విధానం

మెలియోయిడోసిస్ అనేది మనుషులు, జంతువుల్లో వచ్చే బాక్టీరియల్ ఇన్ఫెక్షన్. కలుషితమైన నేల, గాలి లేదా నీటితో సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. తుపానులు, భారీ వర్షాలు, ఇతర తీవ్రమైన వాతావరణ సంఘటనల తర్వాత కేసులు పెరగవచ్చు. ఈ వ్యాధి తరచుగా ఇతర పరిస్థితులతో పోల్చబడటం వల్ల నిర్ధారణ కష్టమవుతుంది. బ్యాక్టీరియా నేల నుంచి చర్మం కోతలు, పుండ్లు, వాటిని పీల్చడం లేదా కలుషితమైన నీటిని తాగడం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. బ్యాక్టీరియా సాధారణంగా మనుషుల నుంచి లేదా జంతువుల నుంచి వ్యాపించదు. త్వరగా చికిత్స చేయకపోతే, ఇన్ఫెక్షన్ శరీరంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించి, సెప్సిస్ (రక్త విషం) వంటి తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతుంది. కొన్నిసార్లు మరణం కూడా సంభవిస్తుంది.

పలు అవయవాలపై ప్రభావితం

అవయవ వ్యవస్థను ప్రభావితం చేయవచ్చు, ఊపిరితిత్తులు, చర్మం, చర్మాంతర్గత కణజాలాలు, ఎముకలు, కీళ్లు, కాలేయం, ప్లీహము, క్లోమం, మూత్రపిండాలు, మూత్రాశయం, ప్రోస్టేట్, జననేంద్రియ అవయవాలు, మెదడు, మెనింజెస్, పరోటిడ్ గ్రంథులు (ముఖ్యంగా పిల్లలలో), శోషరస గ్రంథులు, పెరికార్డియం

పెద్దలపై ప్రభావం

మెలియోయిడోసిస్ సాధారణంగా 40 నుంచి 60 సంవత్సరాల వయస్సు వారిలో కొన్ని అంతర్లీన పరిస్థితులతో ప్రభావితం చేస్తుంది. 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు మెలియోయిడోసిస్ అరుదుగా వస్తుంది.

యాంటీబయాటిక్స్‌తో నయం

మెలియోయిడోసిస్‌ను యాంటీబయాటిక్ చికిత్స ద్వారా నయం చేయవచ్చు. అయితే, కొన్ని ఇన్ఫెక్షన్లు త్వరగా తీవ్రమవుతాయి. అన్ని సందర్భాల్లోనూ చికిత్స ప్రభావవంతంగా ఉండకపోవచ్చు. సకాలంలో తగిన చికిత్స అందించకపోతే మెలియోయిడోసిస్ 10 నుంచి 20 శాతం కేసుల్లో ప్రాణాంతకం అవుతుంది.

వర్షాకాలంలో కేసులు ఎక్కువ



ఈ వ్యాధికి యాంటీబయాటిక్స్ తప్పనిసరిగా ఐదు నుంచి ఆరు వారాల పాటు వాడాలి. వర్షాకాలంలో కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. టీబీ లక్షణాలుగా భావించి వ్యాధిని సక్రమంగా గుర్తించకపోవడం వల్ల తీవ్రత పెరిగి ప్రాణాలుపోయే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. బ్లడ్ కల్చర్ ద్వారా మాత్రమే నిర్ధారణ జరుగుతుంది.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్ స్పెషలిస్టు, గుంటూరు

మెలియాయిడోసిస్ లక్షణాలు

- వ్యాధి సోకిన వారిలో దీర్ఘకాలిక దగ్గు ఉంటుంది.
- అధిక జ్వరం, బరువు తగ్గడం, రాత్రి చెమటలు వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- దగ్గితే రక్తం పడుతుంది.
- కడుపు లేదా ఛాతీ నొప్పి ఉంటుంది.
- కండరాలు, కీళ్ల నొప్పి, తలనొప్పి, మూర్ఛలు ఉంటాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- డయాబెటిస్, దీర్ఘకాలిక వ్యాధి బాధితులు మట్టి, నిలబడి ఉన్న నీటితో సంబంధాన్ని తగ్గించుకోవాలి.
- తడి నేల, మురుగు నీరు, బురదలో నడుస్తున్నప్పుడు జల నిరోధక బూట్లు ధరించాలి.
- తోట పని, మట్టితో పని చేసేటప్పుడు చేతి తొడుగులు ధరించాలి.
- గాయాలు లేదా పుండ్లపై వాటర్ ప్రూఫ్ కవరింగ్‌లను ఉపయోగించాలి.
- గాయాలలోకి కలుషితమైన నీరు, మట్టిని పోకుండా చూసుకోవాలి.
- మట్టిలో, బురద నీటిలో పని చేసిన తర్వాత స్నానం చేయాలి.
- చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- పచ్చికను కోసేటప్పుడు, కలుపు మొక్కలను తొలగించేటప్పుడు, నేల చుట్టూ అధిక పీడన స్ప్రేని ఉపయోగిస్తున్నప్పుడు మాస్క్ ధరించాలి.

ఓటరు పరిశీలన సమర్థంగా నిర్వహించాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రశాంతమైన, పారదర్శకమైన ఎన్నికలకు ఓటరు పరిశీలన సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని బూత్ లెవల్ అధికారులందరికీ ఎన్నికల సంఘం వద్ద శిక్షణ పొందిన మాస్టర్‌తో శిక్షణ ఇప్పించామని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బూత్ లెవెల్ అధికారులందరూ ఓటరు దరఖాస్తులను మరింత మెరుగ్గా పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు స్థానిక సంస్థల నుంచి ధ్రువీకరణ పత్రాలను సేకరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2026పై ఎన్నికల సంఘం మార్గదర్శకాలు వచ్చిన వెంటనే బీఎల్వోలు డోర్ టు డోర్ వెళ్లి ఓటరు జాబితా వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. ఇటీవల సచివాలయం ఉద్యోగుల బదిలీలు జరిగిన నేపథ్యంలో బీఎల్వోల మార్పులు, చేర్పులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని వివరాలు అందజేయాలని ఆమె కోరారు. రాజకీయ పార్టీలు సహకారం, సూచనలను తప్పకుండా పరిగణలోనికి తీసుకుని అవకాశం ఉన్న వరకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి దరఖాస్తులను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

- ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి
- అడ్మిషన్ కార్డులు పంపిణీ
- తొలిరోజు 67 మందికి ప్రవేశం



కాలేజ్ అడ్మిషన్ కార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీకి 80 ఏళ్ల చరిత్ర ఉందని, ఇక్కడ సీటు రావడం అదృష్టంగా భావించాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో హెల్త్ యూనివర్సిటీ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన 67 మంది ఫస్ట్ ఇయర్ వైద్య విద్యార్థులకు ఆయన మంగళవారం కాలేజీ అడ్మిషన్ కార్డులు అందజేశారు. వైద్య కళాశాలలో 250 సీట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. గుంటూరు వైద్య కళాశాలలో అభ్యసించిన ఎంతో మంది ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గాంచిన వైద్యులుగా సేవలందిస్తున్నారని చెప్పారు. ఎంతో మంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, కలెక్టర్‌లుగా, ఎంపీలుగా, ఇతర ప్రజాప్రతినిధులుగా, ఉన్నత పదవుల్లో పనిచేసి పద్మశ్రీ , పద్మభూషణ్, పద్మవిభూషణ్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు సైతం పొందారని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన వైద్య కళాశాలలో అడ్మిషన్ పొందిన వారంతా కష్టపడి చదివి కన్న తల్లిదండ్రులకు, వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, మంచి వైద్యులుగా సేవలందించాలని ఆయన వెల్లడించారు. వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రతిరోజూ విద్యార్థులను గమనిస్తూ ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

రేపు డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 28న గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల వారీగా జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చి, వ్యక్తిగతంగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు వాటిని డౌన్లోడ్ చేసుకుని, అందులోని సూచనలు పాటించాలని ఆమె సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరయ్యే ముందుగా వెబ్‌సైట్‌లో వ్యక్తిగత డీఎస్సీ–2025 లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేసుకుని, పరిశీలనకు హాజరుకావాలని తెలిపారు. విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన మూడు సెట్ల ఫొటోస్టాట్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సామాజిక వర్గ ధ్రువీకరణ, వైకల్య నిర్ధారణ పత్రాలతో పాటు కాల్ లెటర్‌తో హాజరు కావాలని ఆమె సూచించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,800

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	60,157
అమ్మకాలు	58,321
నిల్వ	11,337

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,500
నంబరు–5	10,000–13,500
341	10,000–15,300
సూపర్–10	10,000–13,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,000
నంబరు–5	10,000–13,600
341	11,000–15,400
4884	10,000–13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,200
బాడిగ–355	10,000 – 14,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,000
తాలుకాయలు	6,000 – 7,600

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,300
బాడిగ – 355	10,000–14,000
దేవనూరు డీలక్స్	10,500–13,600
తాలు	5,200 – 7,300

–కొరిటెపాడు (గుంటూరు)

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

తెనాలి రూరల్: గంజాయి వినియోగంతో పాటు విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక బాలాజీరావుపేట కొబ్బరి చెట్ల వద్ద గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ కేసులతో బీసీల అణచివేతకు కుట్ర

- కూటమి పాలనలో అన్ని వర్గాలకు అవస్థలు
- వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : కూటమి ఏడాదిన్నర పాలనలో బీసీలు అన్ని రకాలుగా అణిచివేతకు గురవతున్నారని..వారిపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కేయాలని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. గుంటూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీతో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ కార్యక్రమంలో భాగంగా ఎంబుక్‌లో ఫోర్జరీ సంతకాలు చేశారని అభాండాలతో వైఎస్సార్ సీపీకి చెందిన పెదకాకాని ఎంపీపీ శ్రీనివాసరావుపై పొన్నూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించారని తెలిపారు. యాదవులు అంటే మంచితనానికి మారుపేరని..వారు మాట ఇచ్చారంటే దాని మీద నిలబడతారన్నారు. అటువంటి వారిపై అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని సూచించారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో బీసీలకు అన్ని రంగాల్లో ప్రథమ స్థానం కల్పించి పైకి తీసుకువస్తే, కూటమి ప్రభుత్వం ఈవీఎంలతో అధికారంలోకి వచ్చి అక్రమ కేసులు పెట్టి వారిని అణగదొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. ఎంపీపీ శ్రీనివాసరావు శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేయిస్తే దాన్ని కూల్చివేయించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల..అదే పొన్నూరు నియోజకవర్గం తక్కెళ్లపాడులో పెద్దఎత్తున వసూళ్లు చేసి శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారని వివరించారు. దీన్ని తీవ్రంగా ఖండించిన తెలుగు రాష్ట్రాల్లోని యాదవులంతా ఏకమై హెచ్చరికలు చేశారన్నారు. అక్కడ విగ్రహాన్ని తొలగించి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అరాచకంతో, అధికారం ఉందని ఏదైనా చేయగలమని చూస్తే ప్రజలు చూస్తు ఊరుకోరని కారుమూరి చెప్పారు.

ధూళిపాళ్ల కక్ష

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినప్పటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అక్రమాలకు చెక్ పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడిగా పిచ్చిరెడ్డి

నెహ్రూ నగర్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ గుంటూరు జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడిగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన ఉడుముల పిచ్చిరెడ్డిని నియమించారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మహిళపై దాడి చేసి బంగారు గొలుసు, గాజుల అపహరణ

కొల్లిపర: ఒంటరిగా ఉన్న మహిళపై ఇద్దరు యువకులు దాడి చేసి బంగారు గొలుసు, ఎనిమిది బంగారు గాజులు అపహరించిన ఘటన కొల్లిపర మండలం అత్తోటలో మంగళవారం జరిగింది. దాడి ఘటనలో బాధితురాలు తలకు తీవ్రమైంది. పోలీసుల కథనం ప్రకారం ... గ్రామ మాజీ సర్పంచ్ బొల్లిమంత సాంబశివరావు భార్య బుల్లెమ్మ భర్త చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తోంది. కూతుళ్లు తెనాలిలో ఉంటారు. బుల్లెమ్మ మంగళవారం ఆరు బయట కూర్చుని ఉండగా ఇద్దరు యువకులు దాడి చేసి, ఆమె మెడలోని బంగారు గొలుసుతో పాటు ఎనిమిది బంగారు గాజులు లాక్కుని వెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరావు తెలిపారు .

ముగిసిన జిల్లా ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 బాలబాలికల పోటీలు ముగిశాయి. జిల్లా కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభకనబరచిన వారిని ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామని తెలిపారు. పోటీలను ఖేలో ఇండియా కోచ్ చిరంజీవి, డీఎస్ఏ కోచ్ కె.సంగీత బాబు ఆధ్వర్యంలో నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్. క్రిష్టోఫర్, కోచ్‌లు పాల్గొన్నారు.



పోటీల్లో పతకాలు సాధించిన బాలబాలికలు

పొగాకు కొనుగోలు నిరంతరం జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: జిల్లాలో రైతుల నుంచి పొగాకు కొనుగోలు ప్రక్రియ నిరంతరం జరగాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంతోపాటు, ప్రైవేటు కంపెనీలు కూడా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో 3,895 మంది రైతులు పొగాకు సాగు చేయగా, 3,370 మంది రైతులు ప్రభుత్వానికి విక్రయించేందుకు సీఎం యాప్‌లో నమోదు చేసుకున్నారని జేసీ వెల్లడించారు. కొనుగోలు కోసం ఇప్పటి వరకు 1,614 మంది రైతులకు షెడ్యూల్ ఇచ్చారని తెలిపారు. ఏపీ మార్కెట్‌మార్క్‌ఫెడ్ ద్వారా 1063 మంది రైతుల నుంచి ప్రభుత్వం 2,200 టన్నులు కొనుగోలు చేసిందని చెప్పారు. ప్రైవేటు కంపెనీలు కూడా 3,500 టన్నులు కొనుగోలు చేశాయని తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 2,800 టన్నుల పొగాకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టి.నరసింహారెడ్డి, పొగాకు రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన యువకుడు మృతి



గోపీనాయక్ మృతదేహం

కొల్లూరు: చెరువులో పడి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు వెలికి తీయించారు. సోమవారం రాత్రి కొల్లూరు శివారు బోస్‌నగర్‌లో సభావత్తు గోపీనాయక్ (34) గ్రామాన్ని అనుకొని ఉన్న చెరువులో పడి గల్లంతైన విషయం విదితమే. అతని పెద్దమ్మ ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో చెరువులో పడిన వ్యక్తిని గమనించిన మహిళ స్థానికులను అప్రమత్తం చేసింది. స్థానికులు అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి పోలీసులు గజ ఈతగాళ్లను చెరువులోకి దింపి గల్లంతైన యువకుడి కోసం గాలించారు. అర్ధరాత్రి సమయంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ తెలిపారు.

మారథాన్‌లో పతకాలు అభినందనీయం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



ఏఎస్ఐ, హోంగార్డుతో ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: అసాధారణమైన 42 కి.మీ మారథాన్ పరుగును కేవలం ఐదు గంటల్లోనే పూర్తి చేసి, పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ పరుగు పందెం (2025) పోటీలను ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించారు. ఇందులో నల్లపాడు పీఎస్ ఏఎస్ఐ కె.రాజశేఖర్ బాబు (4.42 గంటలు), జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) హోంగార్డు జి.కృష్ణకిషోర్ (4.59 గంటలు) పతకాలు సాధించారు. నగరంపాలెంలోని డీపీఓలో మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఏఎస్ఐ, హోంగార్డు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వారిద్దరిని అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని సూచించారు.

చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

నగరంపాలెం: జిల్లాలో వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి వేడుకలు, నిమజ్జనం కార్యక్రమాల్లో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆయన తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని ఎస్పీ ఆకాంక్షించారు.

'పీఎంవీబీఆర్‌వై'పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్ఎం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయంలో వివిధ సంస్థల ఉద్యోగులు, యజమానుల ప్రయోజనం కోసం ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) కొత్తగా ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన(పీఎంవీబీఆర్‌వై)ను ప్రారంభించినట్లు డీఆర్ఎం సుథేష్ట సేన్ తెలిపారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గుంటూరు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి. గోపాల్‌సింగారు ఆధ్వర్యంలో పీఎంవీబీఆర్‌వైపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యాక్రమంలో ఆమె మాట్లాడారు. పథకం ముఖ్య అంశాలు, ప్రయోజనాలను, ఈపీఎఫ్ఓలో కాంట్రాక్ట్ సంస్థల ఉద్యోగుల నమోదు సంస్థల ద్వారా యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) జనరేషన్ గురించి వివరించారు. కొత్త ఉద్యోగుల నియామకం, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడానికి, యజమానులను ప్రోత్సహించడం లక్ష్యంగా పీఎంవీబీఆర్‌వై పెట్టుకుందని వివరించారు. ఈ పథకం కింద, భారత ప్రభుత్వం కొత్త ఉద్యోగులకు, యజమానులకు ప్రయోజనాలను నిర్దిష్ట కాలానికి చెల్లిస్తుందని తెలిపారు. తద్వారా యజమానులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ఈ పథకం ఈనెల 1వ తేదీ నుంచి 2027 జూలై 31 వరకు అమలులో ఉంటుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో రైల్వే డివిజన్ ఉద్యోగులు, పీఎఫ్ సిబ్బంది కె.నాగరాజు పాల్గొన్నారు.

స్వార్థానికి కూలుతున్న మహా వృక్షాలు



కోసివేసిన పశ్చిమ బ్యాంక్ కెనాల్ అంచుల వెంబడి ఉన్న మహావృక్షం



కాలువ అంచుల వెంబడి మిగిలి ఉన్న కలప

కొల్లూరు: దశాబ్దాల చరిత్ర ఉన్న మహావృక్షాలు రంపపు కోతకు గురై నేలకొరిగాయి. కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ అంచుల వెంబడి పెరిగిన భారీ వృక్షాలు కొందరి స్వార్థానికి మనుగడ కోల్పోయాయి. కొల్లూరు–ఈపూరు మార్గంలో కాలువ అంచుల వెంబడి ఉన్న భారీ వృక్షాలలో ఒకటి ఇటీవల వీచిన పెనుగాలులకు కూలి కాలువలోకి వాలిపోయింది. దాన్ని తొలగించే పేరుతో సజీవంగా ఉన్న వృక్షాలను సైతం కోసి కలపగా మార్చి ట్రాక్టర్లలో తరలించడం విమర్శలకు దారితీస్తోంది. కూలిన వృక్షాన్ని తొలగించడానికి అయ్యే ఖర్చుల కోసం సజీవంగా ఉన్న వృక్షాలను కూల్చడానికి నీటిపారుదల శాఖ అధికారులు తెగించడంపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే భారీ చెట్ల నరికివేతలో నగదు లావాదేవీలు భారీగా జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాబ్‌మేళాలో 117 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఏసీ శిక్షణా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 117 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయ సమీపంలోని ఎస్ఏసీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు 273 మంది నిరుద్యోగులు హాజరు కాగా 10 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన 117 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ నైపుణ్యాలను పెంపొందించటంతో పాటు జాబ్‌మేళాలు నిర్వహించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు. ఎస్ఏసీ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ మేరీ జోత్స్న, ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఎం.వీరాంజనేయులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి తాళ్లూరి సూర్య

సత్తెనపల్లి: సంక్షేమ వసతి గృహ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... అచ్చంపేట మండలం అంబటిపూడి గ్రామానికి చెందిన తాళ్లూరి సూర్య జంగంగుంట్లపాలెంలోని కేసీ రెడ్డి కళాశాలలో బీ ఫార్మసీ తృతీయ సంవత్సరం విద్యనభ్యశిస్తూ సత్తెనపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. ఈ నెల 22న సాయంత్రం వసతి గృహం నుంచి ఇంటికి వెళ్లి మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి హాస్టల్‌కు చేరుకున్నాడు. హాస్టల్‌లో బ్యాగ్ సర్దుకొని ఇంటికని చెప్పి బయటకు వెళ్లి తిరిగి 3.30 గంటలకు మళ్లీ హాస్టల్లోకి వచ్చాడు. వెంటనే గది లోకి వెళ్లి 10 నిమిషాలు పాటు ఉన్న సూర్య బయటకు వచ్చి వసతిగృహంలో పని చేసే కుక్ శ్యాంబాబుతో తనకు కళ్లు తిరుగుతున్నాయని, హాస్పటల్‌కు తీసుకు వెళ్లమని కోరాడు. కుక్ శ్యాంబాబు సరేనని దగ్గరకు రాగా పురుగు మందు వాసన వస్తుండడంతో ఏం జరిగిందో చెప్పమని సూర్యను ప్రశ్నించాడు. తాను ఆత్మహత్య చేసుకునేందుకు గడ్డి మందు తాగానని చెప్పాడు. వెంటనే కుక్ శ్యాంబాబు సంక్షేమ వసతి గృహ అధికారి పాపయ్యకు సమాచారం అందించి, సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు తాగిన మందును కక్కించి ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యానికి గుంటూరు సిఫార్సు చేశారు. దీంతో సంక్షేమ వసతి గృహ అధికారి పాపయ్య విద్యార్థి తల్లిదండ్రులైన అశోక్, సుజాతకు సమాచారం అందించాడు. హుటాహుటిన గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా ప్రస్తుతం వైద్యశాలలో డయాలసిస్ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రేమ వ్యవహారంలో భాగంగా చదువు కోవటం కష్టంగా ఉందంటూ విద్యార్థి సూర్య వాపోయినట్లు సమాచారం. ఈ ఘటన సంక్షేమ కళాశాల వసతి గృహంలో కలకలం రేపింది. చేతికి వచ్చిన కుమారుడు ఆత్మహత్యకు యత్నించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

నరసరావుపేట: జిల్లాలో గ్రామ పంచాయతీలకు తొమ్మిది నెలల నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులు, రిజిస్ట్రేషన్ సర్‌ఛార్జి నిధులను విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘ ముఖ్యసలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. రిజిస్ట్రేషన్ సర్‌చార్జి నిధులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యేవిధంగా కృషిచేయాలని, రిజిస్ట్రేషన్ ఐజీతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీలలో రిజిస్ట్రేషన్ సర్‌చార్జి, 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తే సర్పంచులు, గ్రామ పంచాయతీలకు ఊరటగా ఉంటుందని తెలిపారు.